# ఒంటరితనం

కుటుంబం, ఒంటరితనం
మతదాడులు, బాంబుదాడులు
పోలీసుదాడులు, రాజకీయదాడులు
భూపోరాటాలు, ఆత్మహత్యలు
ప్రేమికులకు ఒంటరితనం

యుద్ధం పోరాటాలు,
కొందరి వ్యాపారం, కొందరి ఆత్మరక్షణ
ఇందనం కొట్టేయ్యాలి శ్రమను దోచేయాలి
దోపిడీతనం మనని ఒంటరిని చేస్తుంది

వ్యవస్థపై యుద్ధం నక్సలిజం పేరు
ఫలం జీవిత భాగస్వామిని త్యాగం
కన్నపేగును త్యాగం
అవునన్నా కాదన్నా అర్థం చేసుకోరు
సిద్ధాంతాలు అర్థం కాని తల్లుల ఒంటరిపోరు

పేదరికం పని! పని శ్రమ
వీరికి ఊసంతా పని దేవులాట
రోజువారి జీవనం ఓ పోరాటం
ఇల్లు గడవడం పిల్లల పొట్టనింపడం
శరీరం అప్పగింత

అనంతమైన ఒంటిరితనం

రాజ్యహింసట
వర్గపోరాటమే పరిష్కారమట
ఇక్కడ స్త్రీల పట్ల వివక్ష
ప్రస్తావన పరిష్కారం కాదట

ఒంటరితనంబాహ్యమైనది

కులం ఆత్మగౌరవ పోరాటాలు
ఇంటా బయట జరిగినా అవమానం
కడుపు చించుకుంటే కాళ్లమీద పడ్డట్టు
ఒంటరితనం మానసికము కూడా

కులంలో కుటుంబ హింస
కుల పంచాయితీలే తీర్చాలట
ఒంటరితనం సమూహానికి చెందింది కావొచ్చు

మతంలో కుటుంబం, హింస

మాట్లాడొద్దు! మత ప్రవక్తల ఆదేశం
మతంలో స్త్రీ పురుషుల మధ్య వివక్ష
మాట్లాడదామా అంటే మతం
రాజకీయమై భయపెడుతుంది
ఇక్కడ ఒంటరితనం విశ్లేషణకు అతీతం

గుప్పిటి విప్పితే గుట్టుఏమిటో?
తెలుస్తుందంతే
ఎవరికేది స్వప్రయోజనమవుతుందో!

నిర్వచనాలను అనుమానించాలంతే
కాదు అన్నీ నలుపు తెలుపు
వలయ లయలు ఎన్నో!

ఒంటరితనం అనేకానేకాలు
ఒంటరితనం మీది మాది కూడా
మా ఒంటరితనంకు తోడై వస్తామనే

జంటగాళ్లతోనే మా సమస్యంతా
మమ్మల్ని ఒంటరిగా ఒదిలేస్తే
మాకదే పదివేలు!

దానికై అది మమ్మల్ని భాదించదు.
అసహాయతకు ఒంటరితనం సమస్య కాదు
జంటతనానికి మనమిచ్చె అర్థంతోనే సమస్యంతా

ఒంటరిజీవితం చాలా సృజనాత్మకతతో కూడినది
సందర్భంలో తేడా అంతే!

వి.ఉషారాణి
హైద్రాబాద్
12. 9. 07